## సంకల్ప హాస్పిటల్స్ అధినేత డా.వీరేశ్వర్‌కు

# ఘన నివాళులు

- ◆డా. బండ్ల వీరేశ్వర్‌కు ఘన నివాళులు
- ◆సంకల్ప హాస్పిటల్‌లో సంస్మరణ సభ
- ◆ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా.సోమేశ్వర్ బండ్ల
- ◆డా.వీరేశ్వర్‌ను తలచుకుని ప్రముఖ వైద్యుల భావోద్వేగం..
- ◆ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్




సంకల్ప గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత, దివంగత ప్రముఖ వైద్యులు డా.వీరేశ్వర్ బండ్ల కు శుక్రవారం ఖమ్మంలోని సంకల్ప హాస్పిటల్‌లో ప్రముఖ వైద్యులు, సంకల్ప హాస్పిటల్ సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు. ఖమ్మం ఉమ్మడి జిల్లాలో ఒక మంచి ఆశయంతో, పవిత్ర లక్ష్యంతో స్థాపించిన సంకల్ప హాస్పిటల్స్ అతి తక్కువ కాలంలో అందరికీ నాణ్యమైన వైద్యసేవలు అందించేలా చేయడంతో పాటు వైద్య రంగానికి ఆత్మబంధువుగా మారి, అంతలోనే అనంత లోకాలకు వెళ్లిన డా.వీరేశ్వర్ మృతి తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని డాక్టర్లు, సిబ్బంది గుర్తుచేసుకున్నారు. తొలుత డా.సైదులు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, డా. వీరేశ్వర్ స్వయానా సోదరుడు డా. సోమేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్మరణ సభలో మొదటిగా డా.వీరేశ్వర్ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సంకల్ప వైద్యులు డా. గంగరాజు, డా.సీతారాం, డా.వీరేందర్ చిట్టే, డా.రవికుమార్, కోదాటి గిరి, తదితరులు డా.వీరేశ్వర్‌తో వారికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పలువురు వైద్యులు, సిబ్బంది తమ సంస్థ అధినేత మరణాన్ని తలుచుకుని కన్నీటి పర్యంతమయ్యారు. అక్కడ ఏర్పాటుచేసిన డా.వీరేశ్వర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

**డా.వీరేశ్వర్ గొప్ప మానవతావాది..**

డా. వీరేశ్వర్ సమాజం కోసం తనను తాను అర్పించుకున్న గొప్ప మానవతావాది అనీ, ఆయన భౌతికంగా మరణించినా ఆయన జ్ఞాపకాలు మన మనసుల్లో పదిలంగా ఉంటాయని ఆయన సోదరులు డా.సోమేశ్వర్ తెలిపారు. చిన్న నాటినుండే పట్టుదల కలవాడిగా, అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో ఎంతవరకైనా వెళ్లే దృఢ సంకల్పం కలగిన వాడని గుర్తుచేశారు. అమ్మానాన్న చిన్నప్పుడే చనిపోతే తాను వారి ప్రేమకు దూరమైనా వారు లేని లోటును భర్తీచేసుకునేందుకు అనేక విధాలుగా మానసికంగా సంఘర్షణకు లోనయ్యామనీ, అందుకే వాటిని అధిగమించేందుకు గాను మెడిటేషన్, యోగా లాంటివి చేస్తూ డా.వీరేశ్వర్ పట్టుదలతో చదివి ప్రతీ సంవత్సరం కూడా ఉత్తమ ర్యాంకులు సాధించారని గుర్తుచేశారు. వివాహంలోనూ ఆదర్శంగా నిలిచారనీ, తనతో కలిసి చదువుకున్న సహచర వైద్యురాలు డా.నిర్మలరాణిని కులాంతర వివాహం చేసుకోవడంతో పాటు వారిద్దరూ సమాజ సేవకోసం వారి జీవితాలను అంకితం చేసుకుని పిల్లలు వద్దని నిర్ణయించుకున్నారని అన్నారు. తన తుదిశ్వాస వరకూ సమాజం కోసమే బతికారని గుర్తుచేశారు. అనాధలకు సాయం చేస్తూ, అమ్మానాన్న లేని చిన్నారులను ఆదుకుంటూ, తన సంస్థలోని వైద్యులను కంటికి రెప్పలా కాపాడుతూ తను ఒక ధైర్యంగా నిలిచారని అన్నారు. సమాజంలో సంతానంలేని దంపతులు మానసికంగా కుంగిపోకూడదన్న ఆశయంతో తనకు పిల్లలు లేకున్నా, మరెవరూ సంతానలేమిని తలుచుకుంటూ జీవితాంతం ఆవేదన చెందకూడదన్న మంచి సంకల్పంతో ఖమ్మంలో మాతృశ్రీ సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటుచేశారని అన్నారు. తన సోదరుని మరణాని గురించి వివరిస్తూ డా.సోమేశ్వర్ పలుమార్లు కన్నీటి పర్యంతమయ్యారు. తాము చిన్నప్పుడే అమ్మానాన్నను కోల్పోయి, ఇద్దరం కలిసి ఉన్నతమైన ఆశయాలతో ఎదిగామన్నారు. చివరిగా తన సోదరుడు తెలిసో తెలియకో ఎవరినైనా బాధించి ఉంటే క్షమించాలని కన్నీటితో వేడుకున్నారు. దీంతో సంతాపసభలోని ప్రతీ ఒక్కరూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో డా. చైతన్య, నెల్లూరి యుగందర్, వంశీ, డా. సుమంత్, తదితరులు పాల్గొన్నారు.





